

## ‘అమరన్’కు రజనీ అభినందన

ఆర్మీ మేజర్ వరదరాజన్ నిజ జీవితం ఆధారంగా తెరకెక్కించిన చిత్రం ‘అమరన్’. శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించారు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. అగ్ర నటుడు కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించారు. ఇటీవలే విడుదలైంది. శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి తెలుగులో రిలీజ్ చేశారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ ఈ సినిమాను ప్రత్యేకంగా వీక్షించారు. అనంతరం తన మిత్రుడు కమల్‌హాసన్‌కు ఫోన్ చేసి అభినందించారు. దేశభక్తి నేపథ్యంలో స్ఫూర్తివంతమైన చిత్రాన్ని తీశారని రజనీకాంత్ ప్రశంసించారు. విడుదలైన అన్ని కేంద్రాల్లో అద్భుతమైన స్పందన లభిస్తున్నదని నిర్మాతలు సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

## వినోదాల ‘ధూం ధాం’

చేతన్‌కృష్ణ, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం ‘ధూం ధాం’. సాయికిషోర్ మచ్చా దర్శకుడు. ఎంఎస్ రామ్‌కుమార్ నిర్మాత. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఆద్యంతం అద్భుతమైన కామెడీతో సినిమా తీశారని ఆయన ప్రశంసించారు. చక్కటి వినోదంతో పాటు తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ట్రైలర్ మెప్పించింది. గోపీసుందర్ బాణీలు అలరించాయి. ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ రామస్వామి, సంగీతం: గోపీసుందర్, కథ, స్క్రీన్‌ప్లే: గోపీమోహన్, దర్శకత్వం: సాయికిషోర్ మచ్చా.





## పులుల్ని ఆడించే రింగ్ మాస్టర్

‘నేను మాస్ సినిమా చేసి చాలా రోజులైంది. ‘మట్కా’ పవర్‌ఫుల్ స్టోరీ. చిరంజీవి గారికి ట్రైలర్ బాగా నచ్చింది. నా క్యారక్టరైజేషన్‌లో భిన్న కోణాలుంటాయి’ అన్నారు వరుణ్‌తేజ్. ఆయన కథానాయకుడిగా కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందిన ‘మట్కా’ చిత్రం ఈ నెల 14న విడుదలకానుంది. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్‌ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. శనివారం ట్రైలర్‌ను అగ్ర నటుడు చిరంజీవి ఆవిష్కరించారు. 1950–80 బ్యాక్‌డ్రాప్‌లో ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను పంచుతూ సాగింది. మట్కా కింగ్ వాసు పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించారు. ‘సర్కస్‌లో బఫూన్స్‌ని చూసి జనమంతా నవ్వుతారు. చప్పట్లు కొడతారు. కానీ ఒక చిన్న కర్ర పట్టుకొని పులుల్ని, సింహాల్ని ఆడించేవాడు ఒకడు ఉంటాడు. అలాంటోడే వీడు. రింగ్ మాస్టర్’ వంటి డైలాగ్స్ ఇంట్రెస్టింగ్‌గా అనిపించాయి. దర్శకుడు మాట్లాడుతూ..40 ఏళ్ల క్రితం విశాఖపట్నంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశానని తెలిపారు. సినిమా విజయంపై టీమ్ అంతా పూర్తి నమ్మకంతో ఉన్నామని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

## ఇంతకంటే ఏం కావాలి

‘ప్రేక్షకులు గతంలో నన్ను పక్కింటి కుర్రాడు అనే ఇమేజ్‌తో చూశారు. ఇప్పుడు వారి సొంత ఇంటి అబ్బాయిలా చూస్తున్నారు. ‘క’ చిత్రం నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది’ అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడిగా దర్శకద్వయం సుజీత్–సందీప్ రూపొందించిన ‘క’ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ‘ ఈ సినిమా ఎంత కలెక్ట్ చేస్తుందా అనేది ముఖ్యం కాదు. ప్రేక్షకులకు బాగా చేరువైందనే విషయమే ఎక్కువ సంతోషాన్నిస్తున్నది. ఒక హీరోగా నాకు ఇంతకంటే ఏం కావాలి? ఈ చిత్రానికి తప్పకుండా సీక్వెల్ చేస్తాం’ అన్నారు. కథ విన్నప్పుడే కంటెంట్ చాలా కొత్తగా అనిపించిందని, సినిమా కోసం టీమ్ అంతా ప్రాణం పెట్టి పనిచేశారని, తొలి రెండు రోజుల్లోనే 13.11కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించిందని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమా చూసినప్పుడే ఏదో మ్యాజిక్ జరగబోతుందనే భావన కలిగిందని డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి తెలిపారు. తొలి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ హిట్ సాధించడం ఆనందంగా ఉందని దర్శకులు తెలిపారు.
















